

చలి.

చల్లని చలి

వెచ్చదనం కోరుకునే చలి.

నిర్మానుష్యంగా వున్న బీచ్ రోడ్.

స్కాండల్ పాయింట్.

ఎదురుగా రామకృష్ణ మిషన్.

అలలకు కొద్ది దూరంలో పొడి యిసుక.

తెల్లని పొడి యిసుక.

దానిమీద సుశీలా హనుమంతరావులు.

ప్రక్కనే సముద్రం.

దానిమీద వెన్నెలగీతలు

నీలంగా మెరిసిపోతున్నది.

వెన్నెల.

పిండిలాటి వెన్నెల.

మల్లెదండలవంటి వెన్నెల.

ఇద్దరి తలలమీదనుంచి జారి యిసుకలో పడుతున్నది.

రెండు చేతులతో కాళ్ళను బంధించి కూర్చుంది సుశీల

"మజుందార్"

ఎడమచెయిమీద తల వాల్చుకుని ఆమె ముఖంలోకి చూస్తూ హనుమంతరావు

ఇద్దరి క్రింద మెత్తని ఇసుక.

దానిమీద మనుషుల నీడలు.

దూరంగా కారేదో సున్నని తారురోడ్డు మీదనుంచి జారిపోతోంది.

నిశ్శబ్దం.

ఇద్దరిమధ్య అందమైన నిశ్శబ్దం.

సన్నగా కదులుతూ ఆగిపోయింది.

"అలలువచ్చి తడుపుతాయేమో!"

"ఒక మాట చెప్పనా?"

"ఊఁ" అంది.

"నీవు చాలా బావుంటావ్."

ఆమె పకపకా నవ్వింది.

"ఇంకేదో అనుకున్నాను ఇదేనా?".

హనుమంతరావు కాస్త యిబ్బంది పడ్డాడు.

"ఊఁ(వర్ణించు) వెన్నెలలో సముద్రం అంత అందంగానా?"

"నేను చెబితే నమ్మకం లేదు కాబోలు!"

---

సభ్యతకు కట్టుపడి చొరవచేయని పురుషులంటే కొంత మంది ఆడవాళ్ళకు అనుమానం!

తియ్యని కలలను కరిగించేస్తారు కూడా!

---

కాలికివున్న నల్లని చెప్పులు ప్రక్కన పెట్టింది.

"కాళ్ళనేగా ముందు అవి ము...."

మాట పూర్తి చేయకుండానే నవ్వింది.

"నాటీగా అవుతున్నావ్ హనుమంత రావ్!" అంది.

పచ్చని తన పాదాలపైన చీరవొర కప్పింది.

తెల్లని జార్జెట్ చీరకు ఎర్రని పట్టు బార్డర్.

ఆమెవైపు తదేకంగా చూస్తూ ఉండి పోయాడు హనుమంతరావు.

ఆమె ఏం మాట్లాడలేదు.

ఒక నిముషం యిద్దరిని పలుకరించి వెళ్ళిపోయింది.

"నిన్ను నమ్మలేకపోతే నన్ను నేను నమ్మనట్లేగా!" అంది చుట్టూ గీతలు గీచు కుంటూ.

"నీవు అలావుంటే నాకూ ఎలానో వుంటుంది.

సుశీల పాలవెల్లిలా నవ్వింది. పై నుంచి వెన్నెల మనుపు బుగ్గలపైన పడి పెదాలమీదకు జారి మునిపంటిపైన చిట్లి పోయింది.

"ఏది వెన్నెలో, ఏది యిసుకో ఏవి పాదాలో తెలీటం లేదు."

"యమ్మేలో - తెలుగు తీసుకోల్సింది."

"మనసుకు చెప్పగలిగింది డిగ్రీ కాదు."

"మరి!"

"వార్డెన్‌తో చెప్పివచ్చావా?" మాట మార్చి అడిగాడు హనుమంతరావు.

"అమ్మో! ఏమని? నీ....తో...." మాటలు పూర్తిచేయలేదు.

"ఇంక ఏమైనా వుందా? ప్రొఫెసర్ గారింటి కన్నాను."

"రేపు తెలిసి అడిగితే....?"

"రేపటి సంగతి యివ్వాళ ఎందుకు హనుమంతరావ్?"

"నీ పనలు అర్థంకావు. ఆ మాట కొస్తే ఆడవాళ్ళంతా యింతే...."

"....అంటే నీకు...."

"....అనుకోవాలి నిన్ను చూపి" హనుమంతరావు తొందర తొందరగా తప్పు సరిచేసుకున్నాడు.

సుశీల తొట్రుపాటు చూసుకుని పెద్దగానే నవ్వింది

నవ్వివ ఆయాసం.

గుండెలు ఎగిసి పడుతున్నాయి.

మెడలోని గొలుసు పక్షంమీద లాకెట్ శుభ్రితిగా వూగాయి.

హనుమంతరావు ఆమెవైపు చూపి సముద్రంవైపు దృష్టి మరల్చాడు.

సముద్రం నిశ్శబ్దాన్ని చూపి హోరుగా నవ్వింది.

సన్నని గాలి.

చలిగా....

సుశీల ముడుచుకు కూర్చున్నది.

తలచుట్టూ చెవులమీద ఎర్రని చీర కొంగు.

"చలిగా వుందా?"

"హనుమంతరావువైపు చూస్తూనే తలూపింది."

"అబద్ధాలు చెబితే ముందు ముందు మనకే ప్రమాదం."

స్వెట్టర్ తీసి ఆమె భుజం చుట్టూ కప్పాడు.

"నీకో?"

"నీవు వూహల్లోకి వస్తేనే చాలు వెచ్చగా వుంటుంది. ఎదురుగావుంటే..."

"నీలో భావుకత ఎక్కువైంది."

"నేరం నాదికాదు."

సుశీల నవ్వింది.

కళ్ళల్లో ప్రేమ క్రిందపెదవిని తడుపుతున్నది.

దానిమీద వెన్నెల చార.

ఆమె కుడిచేతికున్న ఎర్రనిగాజు కదిలిస్తూ అన్నాడు.

"నీ కన్నా నీ ఊహలే నయం."



''ఏమో.''

''పిలిచినా నీవు ఎప్పుడోగాని రావు. అవి పిలవకుండానే వస్తాయి, నీవు వెంటనే వెళ్తావు. అవి పొమ్మన్నా పోవు''

''సిగ్గులేకపోతే సరి- వాటికి .'

''అంతేగదా!'' రిలీఫ్‌గా అన్నాడు

మెత్తగా నురగలా నవ్వింది.

మీదనున్న స్వెట్టర్ జారి క్రింద పడింది.

అతను మళ్ళీ భుజంచుట్టూ సర్దాడు.

"ప్రాక్టికల్స్ ఎప్పుడయిపోతాయి?"

చెప్పింది.

"నా నీలి లెటర్‌కు జవాబివ్వలేదేం?"

జవాబుగా నవ్వింది. లాకెట్ పళ్ళ మధ్య దాస్తూ.

హనుమంతరావు గుప్పిటలోకి ఇసుక తీసుకుని జారవిడుస్తూ అన్నాడు.

"మనం మ్యారేజయ్యాక సుఖపడగలం గదూ!"

"ఊఁ" అంది చేతిలోని యిసుక చెప్పులమీద పోస్తూ.

"నిజంగా యిష్టంగదూ నేనంటే?"

లోగొంతుకలో అస్పష్టంగా అంది.

"నీకేం తెలీదు.... నీకేం తెలీదు...."

ఇద్దరి మధ్య.... మళ్లీ ఓ నిశ్శబ్దం.

ఇద్దరి కళ్లలో ప్రేమ.

ఇద్దరి చుట్టూ వెన్నెల నీడ.

నిర్మానుష్యంలో సముద్రపు హోరు.

అల వొకటి ఆమె పాదాలను స్పృశించబోయి తప్పుచేస్తున్నట్లు ఆగి వెనకు వెళ్లిపోయింది.

"ఇక వెళ్దామా?" అంది బద్ధకంగా వొళ్లు విరుచుకుంటూ.

హనుమంతరావు చేయి అందించాడు.

ఆమె సుతారంగా దాని ఆధారంతో లేవబోయింది.

అల తడిపిన తడి యిసుక. తూలి పడబోయింది.

హనుమంతరావు నడుం చుట్టూ చేయి వేసి గట్టిగా పట్టుకున్నాడు.

"థ్యాంక్స్" అంది మెల్లగా.

ఆ చేతిని అలాగే గట్టిగా నడుంచుట్టు వేసి మరింత దగ్గరకు తీసికుందామనుకున్న కోరిక బలవంతాన చంపుకున్నాడు.

ఛాన్స్

● "మన కొత్త పనిమనిషి చూపులు నాకేం బాగాలేవు. అందుకని సాయంత్రం పని మానిపించాను" అన్నది భార్య.

"అంత తొందరగానా? ఆమెకు ఒక అవకాశమన్నా ఇవ్వకుండానా?" అన్నాడు భర్త.

"ఆమెకుకాదు—మీకు అవకాశం ఇవ్వకుండా అంటే బాగుంటుంది." అన్నది భార్య.



అతను జవాబివ్వలేదు.

ఆమెవైపు చూస్తూ నిల్చున్నాడు.

సుశీల తల పైకెత్తి అతన్నే చూస్తూ నిల్చోంది.

క్రింద ఇసుకలో ఏవోపాకినట్లయింది.

ఆమె అతనికి చాలదగ్గర కొచ్చింది.

సముద్రం హోరు లేకపోతే చేతి గడియారం శబ్దం వినపడేది.

నిశ్శబ్దంలో ఆమె.

చక్కని వెన్నెల.

కాటుకలాటి చీకటి మింగే వెన్నెల.

"థ్యాంక్స్ యింకా చెప్పాలా?" అన్నాడు.

"...................."

"నీ కష్టం నాదిగా, నా సుఖం నీదిగా ఎప్పుడొస్తుంది సుశీలా ఆ రోజు?"

అతని గొంతులో వుద్వేగ్నత.

ఆమె సుతారంగా అతని పెదవిమీద చూపుడువేలితో కొట్టింది.

"ఇప్పుడు కాదా?"

అతను.

ఆమెకు గాలికి మధ్య అతను.

చుట్టూ ప్రశాంతత.

సన్నని చలిగాలి.

సముద్రం వెన్నెలను చూసి కేరింతలు కొడుతోంది.

దూరంగా రెండు కొబ్బరిచెట్లు ఊసు లాడుకుంటున్నాయి.

మబ్బుల కొంగుతో చంద్రుడు ముఖం తుడుచుకుంటున్నాడు.

దూరంగా సముద్రంలో ఎవరో ఇద్దరు పాటపాడుకుంటున్నారు పడవనడుపుతూ.

హనుమంతరావు మనసు సముద్రంలా వుంది.

కోరికల కెరటాలు ముందుకు వస్తు న్నాయ్.

చలి వెచ్చదనం కోరుతోంది.

సుశీల వైపు చూశాడు.

మెరిసే కళ్ళతో....

చక్కని వెన్నెల్లో....

ఏదో మెరుపు.

ఏదో భావం

'సుశీలా'' మత్తుగా పిలిచాడు.

"ఊఁ" అంది అస్పష్టంగా.

ఆ గొంతులో తమకం.

ఆమె పెదాలు అదురుతున్నాయి

మరింత దగ్గర కొచ్చింది.

''సుశీలా'' మరింత ప్రేమగా పిలి చాడు చూపుడు వేలుతో ఆమె క్రింద పెదవిరాస్తూ.

సుశీలా ఏ జవాబివ్వలేదు.

తడిసిన క్రింద పెదవి మీద వెన్నెల గీత.

దానిలో కొద్ది స్పందన.

అర్ధ నిమీలితంగా చూసింది.

పై పంటి క్రింద కింద పెదవి నలుగు తోంది.

ఇద్దరూ ముందుకు నడిచారు.

* * *

ఈ జ్ఞాపకాలన్నీ పచ్చగా వుండగానే, వ్యూహాలు రెక్కలు విప్పుకుంటూండగానే హనుమంతరావు సుశీల నుంచి ఒక ఉత్త రం అందుకున్నాడు. సుశీల నుంచి పెద్ద ఉత్తరాలు ఆశించే అతనికి మూడు వాక్యాలే వుండటం ఆశ్చర్యం గొలిపింది.

''హనుమంతరావు!

సభ్యత తెలిసినా చొరవలేని మగ వాడు సుఖపెట్టగలడని ఆడవానిగా నాకు నమ్మకం కుదరటం లేదు. డిసపాయింట్ చేస్తున్నందుకు.... అయామ్ వెరిసారీ!''

సుశీల.

మరోమాట. కలవచ్చినప్పుడు చూడు ఎప్పుడో వచ్చేమంచి కల కోసం యిప్పుడే నిద్రపోవటం మానేయ్! సుఖపడతావ్! సుఖపడతావ్! సెలవ్.

సుశీల.